
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
శుక్రవారం 23 ఆగస్టు 2024



నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా నల్లనయ్య



విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 22: విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా పి.నల్లనయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత కమిషనర్ మల్లయ్యనాయుడిని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కొత్తగా వస్తున్న కమిషనర్ విశాఖపట్నం జీవీఎంసీ కార్యాలయంలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 26 లేదా 27న బాధ్యతలు స్వీకరించనున్నారు.


ఎసెన్షియా ఫార్మా కర్మాగారాన్ని చుట్టుముట్టిన పొగ

మహా విషాదం

- 'అచ్యుతాపురం ఫార్మా సెజ్' ప్రమాదంలో ఇద్దరు జిల్లా వాసులు మృతి
- ఐదుగురికి తీవ్ర గాయాలు
- పరిశ్రమ, ఆస్పత్రుల వద్ద కుటుంబ సభ్యుల రోదనలు

అంతటా విషాదమే. అటు పరిశ్రమ వద్ద.. ఇటు ఆస్పత్రుల్లోనూ.. మరోవైపు స్వగ్రామాల్లోనూ ఎక్కడ చూసినా ఆర్తనాదాలే. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని 'ఎసెన్షియా' కర్మాగారంలో బుధవారం జరిగిన పేలుడు ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. చాలామంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో జిల్లాకు సంబంధించి ఇద్దరు కార్మికులు మృతి చెందగా.. మరో ఐదుగురు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో బాధిత కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. స్వగ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబ సభ్యులను సీఎం చంద్రబాబు పరామర్శించి ఓదార్చారు. అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు.

చంద్రశేఖర్‌రావుకు తీవ్ర గాయాలు



రామభద్రపురం, ఆగస్టు 22: అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో బుధవారం జరిగిన పేలుడులో రామభద్రపురం శిష్టు సీతారాంపురం గ్రామానికి చెందిన కలిశెట్టి చంద్రశేఖరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. రెండేళ్ల నుంచి ఇతను ఆ కంపెనీలో ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం భోజనం తరువాత రెండో షిఫ్ట్‌లో లోపలికి ప్రవేశించిన కొద్దిసేపటికే ఈ ప్రమాదం జరగడంతో చంద్రశేఖర్ కళ్ల రెప్పలకు గాజుముక్కలు ఒక్క ఉదుటున వచ్చి తగిలాయి. అక్కడ తీవ్రగాయమైందని, అదే చోట లిక్విడ్ కూడా చొచ్చుకెళ్లిందని అతని సోదరుడు కలిశెట్టి సాయి తెలిపారు. మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం మెడికేర్‌కు తరలించారు. సీతారాంపురం గ్రామంలో తండ్రి కలిశెట్టి గోవింద, తల్లి శ్రీదేవిలు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంటర్ చదువుకున్న చంద్రశేఖర్ గతకొన్నేళ్లుగా ఆ కంపెనీలో పనిచేస్తున్నాడు. గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆసుపత్రికి వెళ్లినప్పుడు చంద్రశేఖర్‌తో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందిస్తామని, ధైర్యంగా ఉండాలని చెప్పారు.

సొంతూరుకు దగ్గరలో ఉండాలని వచ్చి..


ఆనందరావు(ఫైల్)

పూసపాటిరేగ, ఆగస్టు 22: హైదరాబాద్‌లో చాలా ఏళ్లుగా పనిచేసు కుంటున్న ఆ వ్యక్తి కుటుంబానికి దగ్గరగా ఉండాలన్న ఉద్దేశంతో ఏడాది కిందటే సొంతూరు వచ్చాడు. అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో పనిచేస్తూ ఎప్పటిప్పుడు ఇంటికొస్తూ వెళ్తుండేవాడు. ఇటీవల రక్షాబంధన్ పురస్కరించుకుని చెల్లెలకు రాఖీ కట్టి తిరిగి వెళ్లాడు. అంతలోనే ఆ కుటుంబానికి దూరమయ్యాడు. అచ్యుతాపురం దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన పూసపాటిరేగ పంచాయతీ గొల్లపేట గ్రామానికి చెందిన బమ్మిడి ఆనందరావు(38) విషాదాంతమిది. బుధవారం మధ్యాహ్నం ప్రమాదం జరగ్గా రాత్రి వరకు కుటుంబ సభ్యులకు సమాచారం అందలేదు. ఆనందరావు చనిపోయినట్లు బుధవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో పరిశ్రమ ప్రతినిధులు ఫోన్‌లో తెలిపారు. వెంటనే వారంతా అచ్యుతాపురం బయలుదేరి వెళ్లారు. ఆనందరావుకు భార్య సత్యవతి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్షణాల్లో జరిగిపోయింది

బంగారునాయుడు, క్షతగాత్రుడు

(విజయనగరం రూరల్/గుర్ల)

'పేలుడు జరగడం.. దట్టంగా పొగలు కమ్మేయడం క్షణాల్లో జరిగిపోయిందని చందక బంగారు నాయుడు తెలిపాడు. గుర్ల మండలం చిననాగళ్లవలస గ్రామానికి చెందిన ఈయన ప్రస్తుతం అనకాపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంఘటనపై మాట్లాడుతూ బి షిఫ్ట్‌కి అప్పుడే తనతో పాటు వందలాది మంది లోపలికి వెళ్తున్నామని, అంతలోనే పెద్ద శబ్దం విన్పించిందని, ఏమి జరిగిందో? ఏమీ తెలియలేదు.. ఈలోగానే నాతో పాటు ఎంతో మంది గాయపడ్డారు' అని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నానని ఫోన్‌లో తెలిపాడు.



జగదీష్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

లక్కవరపుకోట, ఆగస్టు 22: అచ్యుతాపురం సెజ్‌లో బుధవారం జరిగిన పేలుడులో తీవ్రంగా గాయపడిన ఎల్.కోట గ్రామం సంగంవీధికి చెందిన పసుపురెడ్డి జగదీష్‌ను ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు గురువారం పరామర్శించారు. జగదీష్ సుమారు 6 సంవత్సరాలుగా ఫార్మా కంపెనీలో ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. తీవ్రంగా గాయపడి ప్రస్తుతం మెడికవర్‌లో చికిత్స పొందుతున్నాడు. అతని ఆరోగ్యం నిలకడగా ఉందని, కోలుకుంటున్నాడని ఎమ్మెల్యే లలితకుమారి తెలిపారు. జగదీష్ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.



సోంపురం యువకుడికి తీవ్ర గాయాలు

వేపాడ, ఆగస్టు 22: ఫార్మా సెజ్‌లో బుధవారం మధ్యాహ్నం జరిగిన ఘోర ప్రమాదంలో వేపాడ మండలం సోంపురం గ్రామానికి చెందిన జాగరపు ప్రకాష్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రకాష్‌కు ముఖంపైన, చేతులకు గాయాలు కావడంతో ఫార్మా యాజమాన్యం అనకాపల్లి ఆస్పత్రిలో చేర్పించారు. ప్రకాష్‌కి తల్లి లక్ష్మీ, తండ్రి రాములు, భార్య మానస, బాబు ఉన్నారు. ప్రమాద వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రికి వెళ్లారు.



మంచి ఉద్యోగమని వెళ్లి..


నారాయణరావు(ఫైల్)

గరివిడి, ఆగస్టు 22: అచ్యుతాపురం ఫార్మా సంస్థలో బుధవారం జరిగిన పేలుడులో అర్తమూరు గ్రామానికి చెందిన ఎం.నారాయణరావు (34) అలియాస్ సంతు మృతిచెందాడు. ఈయనకు మూడు సంవత్సరాల క్రితమే వివాహం జరిగింది. ఏడాదిన్నర బాలుడు అనిషత్ కూడా ఉన్నాడు. మంచి ఉద్యోగమని, భవిష్యత్ బాగుంటుందని నారాయణరావు చెప్పడంతో అక్కడ పనిచేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఇతని తల్లితండ్రులు సత్యం, బంగారామ్మలు వ్యవసాయం చేస్తూ ఊరిలో జీవిస్తున్నారు. నారాయణరావు మరణాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో కుటుంబసభ్యులకు సమాచారం అందింది. గ్రామంలో ఎంతో ఉత్సాహంగా అందరితో కలివిడిగా ఉండే నారాయణరావు మృతితో గ్రామంలో తీవ్ర విషాదం అలముకుంది.

బయటకు ఎలా వచ్చానో తెలియలేదు

గంట్యాడ : కంపెనీలోని మొదటి అంతస్తులో సొల్యూషన్ లీకు అవుతోందని అనుమానం కలిగింది. వాసన రావడంతో చూసేందుకు కంపెనీలో పని చేస్తున్న నలుగురం కలిసి మొదటి ఫ్లోరుకు వెళ్లాం. పైన ఒకచోట బ్లాక్ కావడంతో పాటు ఒక్కసారిగా పొగ దట్టంగా కమ్మేస్తుండడంతో వేగంగా కిందకు దిగి బయటకు వచ్చాను. ఆ తర్వాత ఆసుపత్రికి ఎలా వచ్చానో తెలియలేదు. మొహానికి, చేతికి గాయాలయ్యాయి. అనకాపల్లిలోని వడ్లపూడిలో చికిత్స పొందుతున్నాను. మూడునర్న సంవత్సరాల నుంచి అచ్యుతాపురం ఫార్మాకంపెనీలో పనిచేస్తున్నాను.

- జి. సాయికుమార్,
క్షతగాత్రుడు, బోనంగి



కలవరం

అచ్యుతాపురం ఘటన నేపథ్యంలో.. జిల్లాలోని పరిశ్రమల్లో కార్మికుల భద్రత చర్చనీయాంశంగా మారింది. పరిశ్రమల్లో యాజమాన్యాలు రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో.. కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని జిల్లావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హడావుడి తప్ప.. అధికారులు కనీసస్థాయిలో తనిఖీలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. యాజమాన్యాల నిర్లక్ష్యంతో తరచూ ప్రమాదాలు సంభవించి.. ప్రాణనష్టం వాటిల్లుతోందని మండిపడుతున్నారు. ఇప్పటికైనా కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించేలా పరిశ్రమల్లో పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- అచ్యుతాపురం దుర్ఘటనతో జిల్లా వాసుల్లో ఆందోళన
- పరిశ్రమల్లో కార్మికులకు భద్రత కరువు
- తరచూ తనిఖీలు చేయని అధికారులు


బొబ్బిలి గ్రోత్‌సెంటరులోని బెర్రీ పరిశ్రమలో పొగలు(ఫైల్)

విజయనగరం (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 22: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా సంస్థలో బుధవారం సంభవించిన భారీ పేలుడు ఘటన జిల్లాలోనూ కలవరం సృష్టించింది. ప్రధానంగా కార్మికుల భద్రత అంశం చర్చకు వచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలతో పాటు జూట్, ఇతరత్రా పరిశ్రమలు ఉన్నాయి. పూసపాటిరేగ మండలంలో కెమికల్ పరిశ్రమలు, ఎస్.కోట నియోజకవర్గంలో క్వారీ పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. వీటిల్లో భద్రతాచర్యలు పాటిస్తున్నవి కొన్నే. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌తో పాటు నెల్లిమర్ల మండలంలోనూ పారిశ్రామికవాడ ఉంది. అయితే అక్కడి కార్మికులకు భద్రత లేదు. కార్మిక చట్టాలను యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయి. యంత్రాల మధ్య పనిచేసే కార్మికులకు హీట్ రెసిస్టెంట్ ఆప్రాన్లు, గమ్‌బూట్లు, హెల్మెట్లు, గ్లౌజులు విధిగా అందించాలి. వీటిని యాజమాన్యాలు విస్మరిస్తున్నాయి.

- పూసపాటిరేగ మండలంలోని మైలాన్ పరిశ్రమలో 2023 ఏప్రిల్ 25న జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. రియాక్టర్‌లో మెటీరియల్ వేస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. రమేష్, రామకృష్ణ గాయపడ్డారు. ఇది ఉదాహరణ మాత్రమే. జిల్లాలో అనేక ఘటనలు జరిగాయి.

బొబ్బిలిలోనూ విషాదాలు

బొబ్బిలి, ఆగస్టు 22: పొట్టకూటి కోసం ఉపాధి వెతుక్కుంటూ బీహార్ ప్రాంతం నుంచి వచ్చిన కార్మికులు వంటగ్యాస్ లీకైన ప్రమాదంలో 13 మంది తీవ్ర గాయాల పాలై.. ఐదుగురు మృతిచెందిన ఘటన బొబ్బిలి గ్రోత్‌సెంటరులోని బెర్రీ పరిశ్రమలో 2022 జనవరిలో చోటుచేసుకుంది. వారు వసతి పొందుతున్న గదిలో వంట గ్యాస్ లీకవడంతో ఆ అగ్ని ప్రమాదం సంభవించింది. ఫ్యాబ్రికేషన్ ప్రాజెక్టు వర్క్‌లో పనిముగించుకొని రాత్రి రూముకు చేరుకున్న కార్మికులంతా భోజనం ముగించుకొని నిద్రకు ఉపక్రమించారు. అరవింద్‌కుమార్ అనే కార్మికుడు అన్నం వండుకునేందుకు గ్యాస్‌స్టవ్‌ను వెలిగించడంతో అప్పటికే గ్యాస్ లీకై ఉండడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఆ దుర్ఘటనలో చికిత్స పొందుతున్న ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. 13 మంది తీవ్రగాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కాగా 2019 జూన్‌లో స్థానిక బాలాజీ కెమికల్స్‌లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందారు. బాయిలర్‌లో పేలుడు సంభవించడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.

రెండేళ్లుగా తనిఖీలేవీ?

విజయనగరం టౌన్, ఆగస్టు 22 : జిల్లాలో సూక్ష్మ, మధ్య తరహా, భారీ పరిశ్రమలు 650 వరకు ఉన్నాయి. వీటిలో మధ్యతరహా పరిశ్రమలు 51 ఉండగా 15 వరకు మూత పడ్డాయి. భారీ ప్రరిశ్రమలు 11 కాగా వీటిలో 2 ఫార్మా కంపెనీలు ఉన్నాయి. వాటిల్లో వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు రెగ్యులర్, కాంట్రాక్టు బేసిస్‌లో పనిచేస్తున్నారు. అయితే 2022లో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ ఇతర శాఖలతో కమిటీని ఏర్పాటు చేసి 47 పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించారు. వారు గుర్తించిన లోటుపాట్లపై నోటీసులు అందచేశారు. వీటిలో ఒక పరిశ్రమపై కేసు సైతం నమోదు చేశారు. ఆ తర్వాత ఇప్పటివరకు పరిశ్రమల్లో భద్రతపై ఎటువంటి తనిఖీలు నిర్వహించలేదు.

ఎస్.కోట సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

- రిజిస్ట్రేషన్, స్టాంపుల విభాగం డీఐజీ ఉత్తర్వులు

విజయనగరం క్రైం, ఆగస్టు 22: విజయనగరం జిల్లా శృంగవరపుకోట (ఎస్.కోట) సబ్‌రిజిస్ట్రార్ శ్యామలని సస్పెండ్ చేస్తూ రిజిస్ట్రేషన్, స్టాంపుల విభాగం డీఐజీ విజయలక్ష్మీ గురువారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. కొద్ది రోజుల కిందట రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌సీ సిసోడియా జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, ఆయా ప్రాంతాల్లో జరిగిన భూ ఆక్రమణలపై సమీక్షించారు. అనంతరం ఎస్.కోట కార్యాలయాన్ని సందర్శించి అవకతవకలు జరిగినట్టు గుర్తించారు. సబ్ రిజిస్ట్రార్ శ్యామల సస్పెన్షన్‌కు సిఫార్సు చేశారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్, స్టాంపుల డీఐజీ విజయలక్ష్మీ సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు 775 పంచాయతీల్లో గ్రామసభలు



కలెక్టరేట్, ఆగస్టు 22: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 775 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించేందకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతి గ్రామంలోనూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ గ్రామ సభ నిర్వహించ నున్నారు. గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి చర్చించి నిర్ణయం తీసుకుంటారు. 38 రకాల అభివృద్ధి పనులపై చర్చిస్తారు. ప్రధానంగా వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు, గోశాలల నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఈ సభలకు ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నారు. గంట్యాడ మండలం డీకేపర్తి పంచాయతీ పరిధిలో అడ్డతీగగ్రామంలో జరిగే సభకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు హాజరు కానున్నారు. గంట్యాడ గ్రామంలో జరిగే సభకు కలెక్టర్ అంబేడ్కర్ హాజరయ్యే అవకాశాలు ఉన్నట్లు మండల అభివృద్ధి అధికారి వెల్లడించారు.

ఉలిక్కిపడ్డ రాజాం

- గన్ సంస్కృతిపై వ్యాపారులు, బంగారు వర్తకుల్లో భయాందోళన
- ఘటనపై వివిధ కోణాల్లో ఆరా తీస్తున్న పోలీసులు

రాజాం రూరల్/ గరివిడి, ఆగస్టు 22: గరివిడి మండలం అప్పన్నవలస వద్ద జరిగిన సంఘటనతో రాజాం ప్రాంతం ఉలికిపడింది. వ్యాపార లావాదేవీల కోసం నిత్యం రాజాం నుంచి విజయనగరం, విశాఖ తదితర ప్రాంతాలకు ఆ గ్రామం మీదుగానే రాకపోకలు సాగించే వ్యాపారులు, బంగారు వర్తకులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గన్‌తో గురిపెట్టి బెదిరించి కాల్పులు జరపడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాజాం ప్రాంతంలో వెస్ట్‌బెంగాల్ ప్రాంతానికి చెందిన సుమారు 30 మంది బంగారం నిపుణులు రెండు దశాబ్దాలకు పైగా స్థిరపడ్డారు. వీరంతా బంగారం షాపుల యజమానులపై ఆధారపడి జీవనాన్ని సాగిస్తున్నారు. ఆభరణాల తయారీ కోసం లక్షలాది రూపాయల విలువచేసే బంగారంతో పలుమార్లు విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం వెళ్లి వస్తుంటారు. తాజాగా జరిగిన కాల్పుల సంఘటనతో భయాందోళన చెందుతున్నారు.

ఘటన జరిగిందిలా..

రాజాం పట్టణానికి చెందిన బంగారం వ్యాపారులు కిల్వర్ హుస్సేన్‌మాలిక్, షేక్ నజీమ్‌లు సుమారు 50 గ్రాముల బంగారాన్ని విజయనగరం తీసుకువెళ్లి అక్కడి మార్కెట్‌లో మెరుగులు దిద్దించి తిరిగి బైక్‌పై బుధవారం రాత్రి 9 గంటల సమయంలో రాజాం బయలుదేరారు. చీపురుపల్లి దాటి అప్పన్నవలస సెంటర్‌కు వచ్చేసరికి ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు వీరి బైక్‌ను అడ్డుకున్నారు. వారి దౌర్జన్యాన్ని గమనించిన ఆ వ్యాపారులు రహదారి పక్కన ఉన్న సమీప పొదల్లోకి బంగారు ఆభరణాల్ని విసిరేశారు. దీనిని గమనించని దొంగలు విలువైన వస్తువులు, డబ్బులు, సెల్‌ఫోన్ ఇచ్చేయాలని ఒత్తిడి చేశారు. వినకపోవడంతో ఇద్దరిపైనా నాటు తుపాకీ గురిపెట్టి కాల్పులకు దిగారు. అంతేకాకుండా తమతో తెచ్చిన కారాన్ని ఇద్దరి కళ్లల్లో జల్లి ఇనుపరాడ్లులతో దాడి చేశారు. గాయపడిన వ్యాపారులు పూర్తిగా తేరుకోకమునుపే వారి దగ్గరున్న కొంత నగదు, సెల్‌ఫోన్‌లను తీసుకుని దుండగులు బైక్‌పై పరారయ్యారు. గాయాలపాలైన ఇద్దరు రాజాం ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గరివిడి ఎస్‌ఐ ఎల్.దామోదరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా గురువారం ఉదయం రాజాంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో హుస్సేన్‌కు శస్త్ర చికిత్స నిర్వహించారు. చేతి భాగంలో దూసుకుపోయిన బుల్లెట్‌ను వైద్యులు తొలగించారు. ఈయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. స్వల్ప గాయాలకు గురైన నజీమ్ ఆరోగ్య పరిస్థితి సైతం అదుపులో ఉంది.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



బర్త్‌డే సర్‌ప్రైజ్!

మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా 'విశ్వంభర' చిత్రంలోని ఆయన లుక్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఒక రాతిపై కూర్చుని ప్రత్యేక శక్తులు కలిగిన త్రిశూలాన్ని పట్టుకుని ఉన్న మెగాస్టార్ పవర్‌ఫుల్‌గా అనిపించారు. ఆయన పుట్టినరోజున టీజర్ విడుదల ఉండదని దర్శకుడు వశిష్ట ముందే స్పష్టం చేయడంతో కొంత నిరాశ చెందిన మెగా అభిమానులను ఈ లుక్ సర్‌ప్రైజ్ చేసింది. 'చీకటి, చెడు ఈ ప్రపంచాన్ని ఆక్రమించినప్పుడు ఒక అద్భుతమైన తార పోరాడడానికి ప్రకాశిస్తుంది' అని చిత్రం టీమ్ ఈ పోస్టర్‌లో పేర్కొంది. 'విశ్వంభర' చిత్రం కోసం ఓ ఫాంటసీ ప్రపంచాన్ని సృష్టించారు. అద్భుతమైన డ్రామా, ఎమోషన్స్‌తో ఈ సినిమా విజువల్ వండర్‌గా ఉంటుందని నిర్మాతలు విక్రమ్, వంశీ, ప్రమోద్ చెప్పారు. అలాగే పుట్టినరోజు సందర్భంగా తండ్రితో దిగిన ప్రత్యేక ఫొటోను రామ్‌చరణ్ విడుదల చేశారు.

నచ్చితే ఎక్కడికైనా వెళతా..

"మనకు నచ్చిన వారి కోసం మనం తప్పకుండా నిలబడాలి. నాకు నచ్చినవారి కోసం ఎక్కడికైనా.. ఎంతదూరమైనా వెళతా.. ఏమైనా చేస్తా. ఈ మూవీ ఫంక్షన్ కోసం తబిత సుకుమార్ నన్ను పిలిచారు. అందుకే 'పుష్ప 2' క్లైమాక్స్ షూటింగ్‌లో ఉండి కూడా.. ఇక్కడికి వచ్చాను. 'మారుతీనగర్ సుబ్రమణ్యం' లాంటి సినిమాలు హిట్టవ్వాలి. ఇలాంటి మంచి కథలు ఉన్న చిత్రాలు మరిన్ని రావాలి అని కోరు కుంటున్నాను" అని అల్లు అర్జున్ అన్నారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రావురమేశ్, అంకిత్ కొయ్య, ఇంద్రజ, రమ్య పసుపులేటి ప్రధాన పాత్రల్లో నటించారు. దర్శకుడు సుకుమార్ భార్య తబిత సుకుమార్ చిత్రాన్ని సమర్పించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్లు అర్జున్, సుకుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. సుకుమార్ మాట్లాడుతూ "ఈ సినిమాను చూశాను. చాలా బాగుంది" అని చెప్పారు. "సినిమా అనుకున్నదానికంటే బాగా వచ్చింది. ఇది టీమ్ ఎఫర్ట్" అని దర్శకుడు లక్ష్మణ్ కార్య అన్నారు.





హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రహస్య గోరఖ్ ఒకటయ్యారు. కర్ణాటకలోని కూర్గ్‌లో బంధు మిత్రుల సమక్షంలో వీరి డెస్టినేషన్ వెడ్డింగ్ జరిగింది. వీరిద్దరికీ తొలి చిత్రం అయిన 'రాజావారు రాణీగారు'లో నటించే సమయంలో ప్రేమలో పడ్డారు. మార్చి 13న వీరి నిశ్చితార్థం జరిగింది.

ఐటమ్ సాంగ్ చేస్తుందా?



నటి శోభితా ధూళిపాళకు ఇటీవలే నాగచైతన్యతో నిశ్చితార్థం జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ అమ్మడును ఓ క్రేజీ ఆఫర్ వచ్చి తలుపు తట్టింది. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్, కియారా అడ్వానీ జంటగా తెరకెక్కనున్న 'డాన్ 3'లో ఓ ప్రత్యేక గీతంలో నటించడానికి శోభితను మేకర్స్ సంప్రదించారట. దానికి శోభిత సమ్మతించారని కొందరు, అదేంకాదు ఇంకా చర్చల్లోనే ఉందని మరికొందరు అంటున్నారు. మరి శోభిత నిజంగానే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా.. లేదా అనేది తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. ఆమె నిర్ణయం కోసం ఆ చిత్ర దర్శక నిర్మాతలే కాదు, అక్కినేని అభిమానులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కొత్త ఇంట్లో నరేశ్



సీనియర్ నటుడు నరేశ్ ఓ ఇంటి వాడయ్యారు. చిలుకూరి బాలాజీ అలయానికి సమీపంలో ఆయనకు ఓ వ్యవసాయ క్షేత్రం ఉంది. అందులో ఓ పెద్ద ఇల్లుని అత్యాధునిక వసతులతో నిర్మించి ఇటీవలే గృహ ప్రవేశం చేశారు. ఈ భవంతికి విజయకృష్ణ మందిరం అని పేరు పెట్టారు. ఇక్కడే హీరో కృష్ణ, ఇందిరా దేవి విగ్రహాలతో ఏర్పాటు చేసిన ఇందిరా దేవి స్ఫూర్తి వనాన్ని కూడా ఆ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా విచ్చేసిన చిత్ర ప్రముఖులకు నరేశ్, పవిత్ర స్వాగతం పలికారు. నరేశ్ కొత్త ఇంటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఇన్ ప్రోగ్రెస్

చిన్నా ఇది వింత లోకం!



నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ కీలక పాత్రలు పోషించిన '35 చిన్న కథ కాదు' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. రానా దగ్గుబాటి సమర్పణలో సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి ఈ సినిమా తీస్తున్నారు. నందకిశోర్ ఈమని దర్శకుడు. ఈ చిత్రం నుంచి భరద్వాజ్ గాలి రాసిన 'చిన్నా.. ఇది వింత లోకం' పాటను విడుదల చేశారు. స్కూల్ ఎపిసోడ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఈ చిత్రం క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.

గరుడ పురాణం ఏం చెబుతోంది?



రిషి, ప్రియాంక కుమార్ జంటగా నటిస్తున్న తెలుగు, కన్నడ ద్విభాషా చిత్రం 'రుద్ర గరుడ పురాణం'. కే.ఎస్.నందీశ్ దర్శకత్వంలో విజయ్‌లోహిత్ నిర్మిస్తున్నారు. ఇటీవలే సినిమా టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నందీశ్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. ఇదో వైవిధ్యభరితమైన సినిమా" అని అన్నారు. "మంచి కథతో తెరకెక్కుతోన్న ఈ సినిమా అందరికీ మంచి ఫీల్ గుడ్ మూవీ చూశామనే అనుభూతిని ఇస్తుంది" అని నిర్మాత విజయ్‌లోహిత్ చెప్పారు.

బయట ప్రపంచం చాలా చెత్తగా ఉంది



'ఏ మహిళ అయినా ఎవరితోనూ తన ఇబ్బందిని చెప్పుకొనే ధైర్యం చేయలేదని అనిపిస్తేనే ఆమెను మరింత ఇబ్బందులకు గురి చేయడానికి ప్రయత్నిస్తారు. అలాంటి వారికి నో చెప్పడం నేర్చుకోవాలి' అన్నారు మంచు లక్ష్మి. చిత్ర పరిశ్రమలో మహిళా ఆర్టిస్టులను వెంటాడి వేధిస్తున్నారని జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెల్లడించిన నేపథ్యంలో మంచు లక్ష్మి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆమె ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'అన్యాయం జరిగిన వెంటనే బయటకు వచ్చి మాట్లాడాల్సిన అవసరం ఉంది. అలాగే ఆర్టిస్టులు తెలివిగా నో చెప్పడం నేర్చుకోవాలి. కెరీర్ మొదలు పెట్టిన సమయంలో నన్నూ కొందరు ఇబ్బంది పెట్టారు. వారిపై గట్టిగా అరిచి నాకు వచ్చిన ఛాన్స్ పోగొట్టుకున్నా. కానీ తర్వాత అలాంటి విషయాల్లో తెలివిగా వ్యవహరించడం నేర్చుకున్నా. అప్పటికీ అవతలి వారు విసిగిస్తుంటే మనం వారికి బుద్ధి చెప్పక తప్పదు. ఎందుకంటే బయటి ప్రపంచం చాలా చెత్తగా ఉంది' అన్నారామె.

FARNAZ

రైల్వే గేటులో నిలిచిన గూడ్స్

● ఎస్.కోట-పుణ్యగిరి రోడ్డులో రాకపోకలు బంద్

● గంటపాటు ఇబ్బందులు పడ్డ స్థానికులు



ఎస్.కోట-పుణ్యగిరి రోడ్డు రైల్వే గేటులో నిలిచిన రైలు

శృంగవరపుకోట, ఆగస్టు 22: శృంగవరపుకోట-పుణ్యగిరి రోడ్డులో ఉన్న రైల్వే గేటు మధ్యలో గురువారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గూడ్సు రైలు అడ్డంగా ఆగిపోయింది. దాదాపు గంట పాటు రైలు కదలకపోవడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. అటు, ఇటు వేళ్లేందుకు వీలులేకపోవడంతో అత్యవసర పనులున్న వారంతా ప్రమాదమని తెలిసినా రైలు కింద నుంచి దూరి దాటు కుంటూ వెళ్లారు. కొంత మంది ఎప్పటికైనా రైలు కదలకపోదా అంటూ నిరీక్షించారు. ఇదే సమయంలో వర్షం పడుతుండడంతో ద్విచక్రవాహనాలను పక్కన పెట్టి సమీప దుకాణాలు, ఇళ్ల వద్దకు పరు గులు తీశారు. స్థానిక దేవీబొమ్మ కూడలి నుంచి పుణ్యగిరి వరకు ఉన్న రోడ్డులో రైల్వే గేటు దాటిన తరువాత బర్మాకాలనీ, వైఎస్ఆర్ కాలనీ, పుణ్యగిరి గ్రామాలు వున్నాయి. వీరికి ఏ అవసరమైన శృంగవరపుకోట, ఇతర ప్రాంతాలకు వేళ్లేందుకు ఈరోడ్డొక్కటే మార్గం. సాంకేతిక లోపంతో గేటులో రైలు ఆగిపోయిందని రైల్వే వర్గాలు తెలిపాయి.

మాదక ద్రవ్యాల జోలికిపోవద్దు



విజయనగరంలోని మయూరి జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకూ గురువారం ఆంధ్రా విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో 'లీవ్ డ్రగ్స్- సేవ్ లైవ్స్' నినాదంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అదితి గజపతిరాజు ప్రారంభించి మాట్లాడారు. మాదక ద్రవ్యాల జోలికి వెళితే జీవితం నాశనం అవుతుందన్నారు. -విజయనగరం రూరల్

పాఠశాల విద్యా కమిటీలతో మరుగుదొడ్ల ఫొటోలా?

కొత్తవలస: పాఠశాల విద్యాకమిటీ సభ్యులను మరుగుదొడ్ల ఫొటోలను తీయమని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల బాత్రూమ్ ఫొటోలను తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తొలగించిన ప్రభుత్వం ఇప్పుడు ఆ బాధ్యతలను విద్యాకమిటీ సభ్యులకు అప్పగించడం ఎంత వరకు సమంజసమని మండల యూటీఎఫ్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ నిర్మలా దేవి, జి.విజయగౌరి తీవ్రంగా ఖండించారు. రెండురోజుల పాటు విద్యాకమిటీ సభ్యులు, రెండురోజులు సచివాలయ సిబ్బంది ఈ ఫొటోలను తీసి ఆన్‌లైన్ అప్‌లోడ్ చేయాలంటూ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసిందన్నారు. ఈ బాధ్యతల నుంచి విద్యా కమిటీ సభ్యులను తప్పించాలని వీరు డిమాండ్ చేశారు.

ఇసుక స్టాక్ పాయింట్ సందర్శన

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో స్థానిక ఏపీఐఐసీ గ్రోత్ సెంటర్ వద్ద గల ఇసుక స్టాక్ పాయింట్‌ను బుధవారం రాత్రి జేసీ సేతు మాధవన్ పరిశీలించిన నేపథ్యంలో గురువారం బొబ్బిలి ఎస్‌హెచ్‌వో సతీష్ కుమార్, తహసీల్దార్ ఎం శ్రీనుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్నటువంటి లారీ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఎమ్మార్వో కార్యాలయం నుంచి ఇసుక లోడింగ్ సంబంధించి పత్రాలు సమర్పించి స్లాట్ బుక్ చేసుకోవడం ద్వారా మాత్రమే ఇసుక స్టాక్ పాయింట్ వద్ద లారీలను అనుమతిస్తారని చెప్పారు. అక్కడ ఉన్న సుమారు 80 లారీలను తక్షణమే ఖాళీ చేయాలనీ, లోడింగ్ సంబంధించి పత్రాలు ఉన్న లారీలు మాత్రమే ఇక్కడ ఉండాలని ఆదేశించారు.

రుచికరమైన భోజనం పెట్టండి

వంగర: పాఠశాలల్లో విద్యార్థులకు మంచి రుచికరమైన భోజనం అందేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని ఎంఈవో దుర్గారావు సూచించారు. వంగర ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

రాజాం: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి సిబ్బంది రాజాంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 85 మందికి పరీక్షలు చేశారు. 29 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. డోల అప్పలనాయుడు, నారాయణశెట్టి గౌరీశంకరరావు, ఎన్. ఉదయ్‌కుమార్, జె.నీలయ్య, పెంకి గౌరీశ్వరరావు, వి.పాపారావు. కె .రాంబాబు. కె.సూర్యారావు, రామారావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ఉచిత శిక్షణ

బొబ్బిలి రూరల్: బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద మూడు నెలల పాటు స్వల్పకాలిక టెక్నికల్ కోర్సులలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిలైన వారు కూడా అర్హులని తెలిపారు. శిక్షణ కాలంలో బస్సు పాసు సౌకర్యం కల్పించనున్నట్టు చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

ఉపాధిలో సిమెంట్ రోడ్లకు అవకాశం

కొత్తవలస: మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకం కింద సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మించుకోవచ్చని ఉపాధి అధికారి జగన్నాథరావు గురువారం తెలిపారు. శుక్రవారం గ్రామసభలలో సంబంధిత పనులకు తీర్మానం చేయవచ్చని చెప్పారు. గోకులం షెడ్లు, బీటీ రోడ్లు, ఏర్పాటు చేసుకునేందుకు వీలుందన్నారు. వేతనదారులందరికీ పని కల్పించడమే ధ్యేయమని తెలిపారు.

రామభద్రపురం ఎస్ఐగా ప్రసాద్

రామభద్రపురం: రామభద్రపురం పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వెలమల ప్రసాద్‌ను నియమించారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ జ్ఞానప్రసాద్‌కు ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఇక్కడ ఎస్ఐగా కొద్దిరోజులు పనిచేసిన జ్ఞానప్రసాద్ విధి నిర్వహణలో ఈ ప్రాంత ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. ఫ్రెండ్లీ పోలింగ్ విధానాన్ని అమలు చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

వేపాడ: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఎంఈవో జగదీశ్వరరావు అన్నారు. బానాది ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. మరుగుదొడ్లను ప్రతి రోజూ శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

15లోగా ఈ క్రాప్ నమోదు చేయించుకోండి

జామి: రైతులు సెప్టెంబర్ 15లోగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ కృష్ణలత అన్నారు. దీనిపై వ్యవసాయశాఖ, వీఆర్‌వోలు, వీపీఏలు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ప్రతిపాదనలు

బొబ్బిలి రూరల్: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు- 2024కు ఈ నెల 28లోగా ప్రతిపాదనలు పంపించాలని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు, ప్రభుత్వ డైట్ ఇతర యాజమాన్యాల కింద పనిచేస్తూ, పదేళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉపాధ్యాయులంతా అర్హులని పేర్కొన్నారు.

నమ్మించి నట్టేట ముంచారు

జగనన్న కాలనీ పేరుతో భూమి స్వాధీనం ● పరిహారం లేదు.. భూమికి భూమి లేదు

● ముఖం చాటేస్తున్న వైసీపీ నేతలు ● లబోదిబోమంటున్న దళిత యువకుడు



పత్రాలు చూపిస్తున్న వినోద్



జగనన్న కాలనీ కోసం తీసుకున్న వినోద్‌కుమార్ భూమిలో ఇళ్ల నిర్మాణం

మెంటాడ: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ దళిత యువకుడు నిలువునా మోసపోయారు. అప్పటి పాలకులు అతని జీవనాధారమైన భూమిని జగనన్న కాలనీ పేరిట తీసుకుని పరిహారం చెల్లించలేదు. ప్రత్యామ్నాయంగా భూమీ ఇవ్వలేదు. దీంతో ఆ యువకుడికి కుదిరిన పెళ్లి సంబంధం కూడా తప్పిపోయింది. దీంతో ఆ బాధితుడు లబోదిబోమంటున్నారు. బుధవారం మీడియా ఎదుట ఆ యువకుడు తన ఆవేదన చెప్పుకున్నారు. అతని వివరాల మేరకు.. విజయనగరం జిల్లా మెంటాడ మండలం లోతుగెడ్డ గ్రామంలోని నిరుపేద దళిత కుటుంబానికి చెందిన పెరుమాల గంగులుకు దశాబ్దాల క్రితం వుయ్యాడవలస వద్ద సర్వే నెంబరు 224-3 లో 1.12 ఎకరాల డీ పట్టా భూమిని అప్పటి అధికారులు మంజూరు చేశారు. ఆ భూమిపై వచ్చిన ఫలసాయంతో గంగులు కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. 10 ఏళ్ల క్రితం గంగులు, అతని భార్య చనిపోయారు. అనంతరం గంగులు కుమారుడు వినోద్ కుమార్ పేరిట అధికారులు పట్టాను మార్చారు. ఆ భూమిలో వినోద్‌కుమార్ జీడిమామిడి, ఉలవలు, గంటెలు సాగుచేసుకుంటూ జీవిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు, అధికారుల కన్ను ఆ భూమిపై పడింది. జగనన్న కాలనీకి భూమిని ఇవ్వాలని కోరారు. తనకు ఏకైక ఆధారం ఆ భూమేనని ఇవ్వనని వినోద్ కుమార్ ప్రాధేయపడ్డారు. అయినా అప్పటి అధికారులు, వైసీపీ నేతలు వినలేదు. రెట్టింపు భూమి లేదా సొమ్ము ముట్టచెబుతామని నమ్మబలికారు. కాదులేదంటే పట్టా రద్దు చేస్తామని బెదిరించారు. ఆతర్వాత ఆ భూమిని స్వాధీనం చేసుకుని జగనన్న లే అవుట్ వేశారు. ఇంటి నిర్మాణాలు జరిగిపోయాయి. అయినా వైసీపీ హయాంలో అధికారులు, నేతలు ఇచ్చిన హామీ నెరవేర్చలేదు. ఇస్తామన్న పరిహారం కూడా చెల్లించక, భూమికి బదులుగా వేరే చోట ఇస్తామన్న భూమి ఇవ్వక వైసీపీ నేతలు, అధికారులు తనను మోసం చేశారని ఆ దళిత యువకుడు కన్నీటిపర్యంతమవుతున్నారు. వైసీపీ నేతలను కలుస్తుంటే తమ ప్రభుత్వం లేదని, తామేమీ చేయలేమని తప్పించుకుంటున్నారని, అధికారుల చుట్టూ తిరుగుతున్నా వారూ ముఖం చాటేస్తున్నారని వాపోయారు. ఏం చేయాలో పాలుపోక గ్రీవెన్స్‌లో కూడా కలెక్టర్‌కు వినిపించుకున్నానన్నారు. తమ కుటుంబానికి ఉన్న ఏకైక ఆధారాన్ని లాక్కున్నారన్నారు.

పెళ్లి సంబంధం తప్పిపోయింది

రెండేళ్ల క్రితం వినోద్ కుమార్‌కు పెళ్లి కుదిరింది. ఇంతలో తనకున్న భూమిని అప్పటి ప్రభుత్వం తీసుకుందని తెలుసుకున్న పెళ్లి కుమార్తె బంధువులు కొన్నాళ్ల తరువాత వివాహం జరిపిస్తామని నెట్టుకొచ్చారు. ఇప్పుడు అడిగితే తమ కుమార్తెను ఎలా పోషిస్తావంటూ వారు అడుగుతున్నాని వినోద్ కుమార్ వాపోతున్నారు.

తగినంత ఇసుక సిద్ధం

● అందుబాటులో సుమారు 50,330 టన్నులు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్, ఆగస్టు 22: జిల్లా అవసరాలకు సుమారు 50,330 మెట్రిక్ టన్నుల ఇసుక సిద్ధంగా ఉందని కలెక్టర్ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఇసుక కోసం ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గతనెల 8 నుంచి ఇసుక ఉచిత సరఫరా విధానాన్ని ప్రారంభించామని, కన్వేయన్స్ చార్జీల కింద మెట్రిక్ టన్నుకు రూ.605 చొప్పున వసూలు చేయాలని జిల్లా స్థాయి ఇసుక కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఉచిత ఇసుక విధానాన్ని ప్రారంభించే నాటికి బొబ్బిలి స్టాక్ పాయింట్‌లో సుమారు 72 వేల మెట్రిక్ టన్నులు, కొత్తవసలలో 12 వేలు, డెంకాడ పాయింట్‌లో 9 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉందన్నారు. ఇప్పటి వరకూ మూడు స్టాక్ పాయింట్లు నుంచి సుమారు 43,704 మెట్రిక్ టన్నులు ఇసుకను ఉచితంగా పారదర్శంగా సరఫరా చేశామన్నారు. ప్రస్తుతం డెంకాడ, కొత్తవలస వద్ద ఇసుక లేదని, బొబ్బిలి మాత్రం సుమారు 50,330 మెట్రిక్ టన్నుల స్టాక్ ఉందన్నారు. సెప్టెంబరు 30 వరకూ జిల్లాలో సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం ఉంటుందని, ఈ అంచనా ప్రకారం వచ్చే నెలాఖరుకు అవసరమైనంత ఇసుక ఇప్పటికే సిద్ధంగా ఉందని వివరించారు. మరో వారం రోజుల్లో వంగర మండలం కొండచాకరాపల్లి వద్ద సువర్ణముఖిలో ఇసుక పూడికలను తొలగిస్తామని, ఇక్కడ లభించే సుమారు 75 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను డెంకాడ, కొత్తవలస స్టాక్ పాయింట్లకు తరలిస్తామని తెలిపారు. ఇసుకను తరలించే వాహనాలను ముందుగా తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ఇసుక సరఫరాకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులుంటే టోల్‌ఫ్రీ నెంబరు 18004256014 కు తెలియజేయాలని సూచించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ ఇసుక సరఫరా, రవాణాను ప్రభుత్వం మరింత కట్టుదిట్టం చేసిందన్నారు. ప్రతి స్టాక్‌పాయింట్ వద్ద శుక్రవారం నుంచి చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని, వాహనాలు తనిఖీ చేస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో జేసీ సేతు మాధవన్ పాల్గొన్నారు.

పెద్దగెడ్డ నీరు అందిస్తాం

● ఎమ్మెల్యే బేబీనాయన



కొట్టక్కిలో మాట్లాడుతున్న బేబీనాయన

రామభద్రపురం: పెద్దగెడ్డ నుంచి రైతులకు సాగునీరు అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. కొట్టక్కిలో గురువారం రైతులు ఆయనను కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ దీనిపై ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సుమారు 3వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎగువన ఉన్న రైతులు మోటార్లు అమర్చి పైపుల ద్వారా నీటి చౌర్యం చేయడంతో కిందన ఉన్న భూములకు నీరు అందడం లేదని ఆయన దృష్టికి తెచ్చారు. దీనిని అరికట్టడానికి చర్యలు చేపడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మడక తిరుపతినాయుడు, రామకృష్ణ, ముల్లు రాంబాబు, వసంతుల తిరుపతినాయుడు, కనిమెరక శంకరరావు, బెవర సీతారాం, గొర్లె రామారావు, యోగినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విజేతగా కోరుకొండ సైనిక పాఠశాల

● ముగిసిన ఆల్ ఇండియా సైనిక పాఠశాలల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్



కోరుకొండ సైనిక పాఠశాల విద్యార్థులకు ట్రోఫీ అందిస్తున్న ప్రిన్సిపాల్ శాస్త్రి

విజయనగరం టౌన్, ఆగస్టు 22: కోరుకొండ సైనిక పాఠశాలలో ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహించిన ఆల్‌ఇండియా సైనిక పాఠశాలల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ గురువారంతో ముగిసింది. ఇంట్రా గ్రూప్ స్పోర్ట్స్ కల్చరల్ మీట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో కోరుకొండ సైనిక పాఠశాల ఓవ రాల్ చాంపియన్ షిప్ సాధించింది. అంబికాపూర్, భువనేశ్వర్, శంబల్‌పూర్ సైనిక పాఠశాలలతోపాటు కోరుకొండ సైనిక పాఠశాల విద్యార్థులు పోటీపడ్డ ఈ మీట్‌లో విజేతగా నిలిచిన కోరుకొండ సైనిక పాఠశాల గ్రూప్ ఎఫ్ విభాగానికి అర్హత సాధించింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సైనిక పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.ఎస్ శాస్త్రి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. వైస్ ప్రిన్సిపల్ కిరణ్, పరిపాలన అధికారి అభిలాష్ బాలచంద్రన్, పాఠశాల ఉపా ధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహా జనసభ ఏర్పాటు చేయండి

జామి: భీమసింగి చక్కెర కర్మాగారం స్థితిగతులను రైతులు, కార్మికులకు వివరించేందుకు వెంటనే మహాజన సభ ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. గురువారం ఆయన జేసీ సేతు మాధవన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం జామిలో విలేకరులతో మట్లాడుతూ కూటమి ప్రభుత్వం కర్మాగారాన్ని తెరిపిస్తుందని రైతులు, కార్మికులు ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. దీనిని ప్రభుత్వం అర్థం చేసుకొని స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకుడు తాట్రాజు రాజారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న కోండ్రు

రాజాం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని మాజీ మంత్రి నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ అన్నారు. బుధవారం రాజాం మండలం గురవాం గ్రామంలో ఓ శుభకార్యంలో పాల్గొని విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. విశాఖలోని మెడీకవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అచ్యుతాపురం ఫార్మా సెజ్ ప్రమాద బాధితులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో కలిసి పరామర్శించామన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కృషిచేస్తానన్నారు. అనంతరం తెలగవీధికి చెందిన టీడీపీ కార్యకర్త మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు కొళ్ల అప్పలనాయుడు, దుప్పలపూడి శ్రీనివాసరావు, గురవాన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్: నగరంలోని ఆరో డివిజన్ పరిధిలోని ప్రశాంతి నగర్‌లో ముత్యాలమ్మ పండుగ గురువారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ముత్యాలమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమలు, చీరెను సమర్పించారు. ప్రశాంతి నగర్‌కి వచ్చిన అదితికి ఉత్సవ కమిటీ ప్రతినిధి గంటా రవి ఘన స్వాగతం పలికారు. అదితి గజపతిరాజుకి పండుగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మీతో పాటు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సూరిబాబు స్ఫూర్తితో పోరాటాలు



కామ్రేడ్ సూరిబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

విజయనగరం దాసన్నపేట: కామ్రేడ్ బుగత సూరిబాబు స్ఫూర్తితో పోరాటాలు కొనసాగిస్తామ ని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. సూరిబాబు నాలుగో వర్ధంతిని అమర్ భవన్‌లో గురువారం నిర్వహించారు. ఆయ న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు కామేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సూరి బాబు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రంగరాజు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గట్టుపై పంటతో అదనపు ఆదాయం



ప్రకృతి వ్యవసాయంపై రైతులతో మాట్లాడుతున్న రీజనల్‌కోఆర్డినేటర్ ప్రకాష్

శృంగవరపుకోట రూరల్: రైతులు పొలంతో పాటు గట్టుపై పంటలు వేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం రీజనల్ కోఆర్డినేటర్ ప్రకాష్ చెప్పారు. వినాయక పల్లిలో ప్రకృతి వ్యవసాయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో రవీంద్ర, వీఏఏ రవిచంద్ర, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెగాస్టార్ జన్మదిన వేడుకలు

రాజాం: జన సైనికుల ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జనసైనికులు ఎల్. వెంకటరమణ, కేవీ ప్రవీణ్, శ్రావణ్ ఆధ్వర్యంలో మొగులివలస శివాలయంలో పూజలు చేశారు. అనంతరం కొండంపేట అనాథ, వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వృ ద్ధాశ్రమానికి రెండు సీలింగ్ ఫ్యాన్లు అందించారు. అన్నంనాయుడు, ఎర్రంనాయుడు, వెంకట్, నారాయణరావు, శేఖర్, సీతారాం, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో స్థానిక శ్రీలక్ష్మి టాకీస్‌లో గురువారం చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా జిల్లా చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి లంక రమేష్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన కేక్ కట్ చేసి కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బొబ్బిలిలో స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవా కార్యక్ర మాలు చేస్తున్న నేను సైతం ప్రతినిధి వాసు, గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్వీ రమణమూర్తి, ఏవీఐఆర్ ఫౌండేషన్, సీనియర్ జర్నలిస్టు కందుల శ్రీనివాసు, మెగా సీనియర్ అభిమాని చెలికాని కేశవ, స్వచ్ఛంద సేవకుడు గొర్లి శంకరరావులను బేబీనాయన చేతుల మీదుగా మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఘనంగా సత్కరించారు.

శృంగవరపుకోట రూరల్: తిమిడి గ్రామంలో మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జనసేన నేత సత్యనారాయణ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం మండల ఫ్యాన్స్ అధ్యక్షుడు రమణ కేక్ కట్ చేశారు.



బొబ్బిలిలో..



రాజాంలో..



ఎస్‌కోట రూరల్: తిమిడిలో

విద్యుదాఘాతంతో.. విగతజీవిగా

● బొబ్బిలి పట్టణంలో బాలుడి మృతి



దుర్గాప్రసాద్ (ఫైల్)

బొబ్బిలి, ఆగస్టు 22: పట్టణంలోని కంచరవీధిలో గురువారం ఉదయం బాత్రూమ్‌లో విద్యుదాఘాతానికి గురై బాలుడు మృతిచెందాడు. దీనికి సంబంధించి స్థానిక సీఐ కటకం సతీష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పిల్లేన గంగ రాజు ఇత్తడి, కంచు సామగ్రి తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య ఉమా, ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు భానోజీ బీఎస్ఎఫ్ జవాను ఉద్యోగం కోసం సిద్ధమవుతున్నాడు. రెండో కుమారుడు దుర్గాప్రసాద్(17) ఇంటర్ రెండో సంవత్సరం చదువుతూ కార్పెంటర్ పనులకు వెళతుంటాడు. గురువారం ఉదయం దుర్గాప్రసాద్ కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాత్రూమ్‌లోకి వెళ్లాడు. అక్కడ విద్యుత్ వైరు తెగి ఇనుపరాడ్‌కు తగిలి ఉంది. దానిని గమనించని దుర్గాప్రసాద్ ఆ రాడ్‌ను పట్టుకోవడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే పడిపోయాడు. బాత్రూమ్‌లో తన కుమారుడు పడిపోయినట్టు గుర్తించిన తండ్రి గంగరాజు వెళ్లి పట్టుకునే ప్రయత్నం చేయగా ఆయనకూ, ఆ వెంటనే వెళ్లిన తల్లి ఉమాకూ విద్యుత్ షాక్ తగిలింది. పక్క గదిలో ఉన్న మృతుని అన్నయ్య భానోజీ పరుగున వెళ్లి పరిస్థితిని చూసి వెంటనే విద్యుత్ మీటర్‌ను ఆఫ్ చేశాడు. తీవ్రంగా గాయపడ్డ దుర్గాప్రసాద్‌ను బొబ్బిలి సీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లిదండ్రులు విద్యుత్ షాక్‌నుంచి తేరుకున్నప్పటికీ తమ్ముడు మృత్యువాత పడ్డాడని భానోజీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి బంధువులకు అప్పగించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ సతీష్ కుమార్ తెలిపారు. స్థానిక సీహెచ్‌సీకి ఎమ్మెల్యే బేబీనాయన విచ్చేసి మృతుని బంధువులను పరామర్శించి ఓదార్చారు.

కేబుల్ వైరు సరిచేస్తూ..

● విద్యుదాఘాతంతో యువకుడు బలి

సీతానగరం (బలిజిపేట): మండలంలోని మిర్తివలస గ్రామ సమీపంలో విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ పాపారావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గాదెలవలస గ్రామానికి చెందిన నారాయణపురం శంకరరావు(21) అదే గ్రామానికి చెందిన ఓ యజమాని దగ్గర 18 నెలలుగా సిటీ కేబుల్‌లో పనిచేస్తున్నాడు. మిర్తివలస గ్రామ సమీపంలో సిటీ కేబుల్ వైరు వేలాడుతుందని శంకరరావుతో అరసాడకు చెందిన వ్యక్తి ఫోన్ ద్వారా తెలియజేయడంతో వైరు సరిచేయడానికి ఆ గ్రామానికి వెళ్లాడు. వైరు సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు పక్కన ఉన్న విద్యుత్ వైరు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి తల్లి ఉంది. చెల్లెలు పావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

● 17న భర్తతో గొడవపడి ఆత్మహత్యాయత్నం

బొబ్బిలి, ఆగస్టు 11: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన సీఐ కటకం సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బిలి మండలం విజయపురి గ్రామానికి చెందిన లావుడి బుచ్చయ్య, జర్ని గౌరమ్మ(45) దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 17న భార్యాభర్తలు ఇద్దరూ కలిసి మద్యం తాగారు. ఈ సమయంలో మద్యం ఇంకా కావాలంటూ జర్నిగౌరమ్మ భర్తతో గొడవపడింది. ఇక చాలంటూ భర్త మందలించాడు. దీంతో కలత చెందిన గౌరమ్మ అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన భర్త బుచ్చయ్య బంధువులు కలిసి ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గౌరమ్మ గురువారం తెల్లవారుజామున కన్నుమూసింది. ఎస్ఐ టి.శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు. మృతురాలికి పిల్లలు లేరు.

మౌలిక వసతుల కల్పన వేగవంతం చేస్తాం

కలెక్టరేట్: మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లోని రెండు గ్రామాల పరిధిలో నిర్మించనున్న గిరిజన విశ్వవిద్యాలయంలో మౌలిక సదుపాయాలను వేగవంతం చేస్తామని కలెక్టర్ అంబేడ్కర్ చెప్పారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సౌరబ్ గౌర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గిరిజన విద్యాలయం పనులపై సమీక్షించారు. ఇది ఇలా ఉంటే దత్తిరాజేరు మండలం మానాపురం రైల్వే గేటు వద్ద నిర్మిస్తున్న రాయ్‌పూర్ జాతీయ రహదారిపై వంతెన నిర్మాణం వచ్చే జనవరి నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

కేజీబీవీలో పరీక్షల పరిశీలన



టెస్టు నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈవో

రేగిడి, ఆగస్టు 22: మండలంలో దేవుదళ కేజీబీవీలో నిర్వహించిన పదోతరగతి బేస్‌లైన్ టెస్టును ఎంఈవో వరప్రసాదరావు గురువారం పరిశీలించారు. సీబీఎస్ఈ సిలబస్‌తో డిజిటల్ విధానంలో రెండోరోజు గణితం సబ్జెక్టులో 37 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఎగ్జామ్ తీరును చూసి ఎంఈవో పూర్తి సంతృప్తి వ్యక్తంచేసి, గ్రూపు సబ్జెక్టులపై నిర్వహిస్తున్న ఎగ్జామ్ సమర్థవంతంగా పూర్తిచేయాలని ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మి, సిబ్బందికి సూచించారు. అబ్జర్వర్‌తో పాటు, సిబ్బంది ఉన్నారు.

శంబలనగరిలో ఆర్పీ పట్నాయక్ సందడి



ఆర్పీ పట్నాయక్‌కు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

ఎస్‌కోట రూరల్: ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ గురువారం సాయంత్రం మండలంలోని రాజీపేట శంబల నగరి ఆశ్రమాన్ని సందర్శించారు. కెరటం మూవీ దర్శకుడు గౌతం పట్నాయక్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. వీరికి ఆశ్రమ ప్రతినిధులు మెమొంటో అందజేశారు.

భోజనం అమలు తీరు పరిశీలన



మధ్యాహ్నభోజనం పరిశీలిస్తున్న ఎంఈవో

బొబ్బిలి రూరల్: గున్నతోటవలస ఎంపీయూపీ పాఠశాలను గురువారం మండల విద్యాశాఖాధికారి ఎన్.వాసు ఆకస్మికంగా సందర్శించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూతో పాటు బియ్యం, గుడ్లు, చిక్కీలు, రాగి పిండి నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి నాణ్యమైన భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వంటకు గ్యాస్ మాత్రమే ఉపయోగించాలన్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

'అమ్మకు ఒక మొక్క'ను విజయవంతం చేయండి

రామభద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'అమ్మకు ఒక మొక్క' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధి ఏపీవో గొలగాని త్రినాథరావు కోరారు. గొల్లలపేటలో గురువారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు పంచాయతీల్లో ఎక్కువ మొక్కలు నాటాలని, సంరక్షించే బాధ్యత కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. శుక్రవారం అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి.. కొత్త పనులు గుర్తిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ సత్యనారాయణ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అండగా టీడీపీ ప్రభుత్వం: ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్: భారీ వర్షాలు వల్ల నష్టపోయిన రైతులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలో పుట్టూరు తదితర ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించారు. వరదలు వల్ల మునిగిపోయిన వరి పంటను పరిశీలించారు. పంట పొలాల్లోకి వరదలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఇరిగేషన్ శాఖాధికారులతో మాట్లాడి శాశ్వతంగా ఈ సమస్యకు పరిష్కారం లభించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ప్రతి ఏడాది సుమారు 400 ఎకరాలు సాగిగెడ్డ ప్రవాహం వల్ల ఈ ప్రాంతంలో ముంపు గురవుతుందని, ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తే రైతులకు ఎంతో మేలని రైతులు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దేవిచంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి గురజాన చంద్రమౌళి, పార్టీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు. ● ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన సేవలను అందించాలని ఎమ్మెల్యే వైద్యులకు సూచించా రు. బందులోపి పీహెచ్‌సీని ఆయన గురువారం సందర్శించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. టీడీపీ నాయకులు బోను దేవి చంద్రమౌళి, గురజాన చంద్రమౌళి తదితరులున్నారు.

ఫార్మా కంపెనీ దుర్ఘటనపై దర్యాప్తు చేపట్టాలి



ఎన్టీఆర్ కూడలిలో నిరసన తెలుపుతున్న కళాసీలు

బొబ్బిలి: అనకాపల్లి ఫార్మా కంపెనీలో జరిగిన ఘోర ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎన్టీఆర్ కూడలిలో గురువారం పట్టణ కళాసీ సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కళాసీ సంఘ అధ్యక్షుడు బోగాది అప్పలస్వామి, వై.అప్పారావులు మాట్లాడుతూ పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ, భద్రత లేని పరిస్థితులు ఉంటున్నాయన్నారు. గడిచిన ఆరు నెలల్లో ఎంతో మంది ఇలాంటి ప్రమాదాలలో మరణించారని, అనేక మంది గాయపడి కోలుకోలేని దుస్థితిలో ఉన్నారని అన్నారు. రక్షణ చర్యలు చేపట్టని పరిశ్రమలను తక్షణం మూసివేయించాలని, లేకుంటే ఎంతోమంది అమాయకులు బలైపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాసీ సంఘ నాయకులు పి.రామకృష్ణ, గోపి, సింహాద్రి, నారాయణ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

- జిల్లా వ్యవసాయాధికారి రామారావు


డెంకాడలో పర్యటిస్తున్న రామారావు

డెంకాడ: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు తాము పండించే పంటల వివరాలను ఈ-క్రాప్ ద్వారా నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావు తెలిపారు. మండల కేంద్రంలో ఆయన గురువారం క్షేత్ర పర్యటన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు వ్యవసాయ సహాయకుల ద్వారా విధిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ-క్రాప్ నమోదు వల్ల రైతులకు వ్యవసాయ పంట నష్ట పరిహారం, వ్యవసాయ రుణాలు పొందడంతో పాటు తాము పండించే పంటను అమ్ముకోవడానికి వెసులుబాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి పి.నిర్మల, గ్రామ వ్యవసాయ సహాయకురాలు అపర్ణ, రైతులు పాల్గొన్నారు.

15లోగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్

భోగాపురం: వచ్చే నెల 15వ తేదీలోగా ఈ-క్రాప్ నమోదు కార్యక్రమం పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.సురేష్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులు, ఉద్యానవనశాఖ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రతిఒక్కరూ సమయానుకూలంగా విధులు నిర్వహిస్తూ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కౌలు రైతులను గుర్తించి వారికి కౌలు గుర్తుంపు కార్డులను అందజేయాలన్నారు. మండలానికి 440 లక్ష్యం కాగా ఇప్పటివరకు 400 కౌలు రైతులకు గుర్తింపుకార్డులు అందజేశామని, మిగతా లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నా రు. అలాగే సాగులో ఉన్న భూములు, సాగుకు అనుకూలంగా ఉండి గత ఐదేళ్లగా నిరుపయోగంగా ఉన్న భూముల వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ, ఉద్యానశాఖ అధికారిణి జ్యోష్ణ్న తదితరులు పాల్గొన్నారు.

మూడో వార్డులో సమస్యలపై ఏకరువు


మూడోవార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని రెల్లివీధి, చాకలివీధి, సంఘ వీధి తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు తాము నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మికి ఏకరవు పెట్టారు. గురువారం వార్డు పర్యటనకు వచ్చిన కమిషనర్, ఇతర అధికారులకు స్థానికులు సమస్యలను వివరించారు. కాలువలపై సిమెంట్ పలకలు లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నామని, దోమలు, పందుల బెడద అధికంగా ఉందని తెలిపారు. తాగునీటి సరఫరా పైపులైను లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని మహిళలు వాపోయారు. వార్డు ప్రజల తరపున టీడీపీ కౌన్సిలర్ బొత్స సురేష్ సమస్యలను అధికారులకు వివరించారు. వార్డు అవసరాలను తీర్చేందుకు కావలసిన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కమిషనర్ రామలక్ష్మి హామీ ఇచ్చారు. ఆమె వెంట ఏఈలు సురేష్, రవి, టీపీఎస్ వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


కమిషనర్‌కు కాలనీల సమస్యలు వివరిస్తున్న వార్డు ఇన్‌చార్జిలు

రాజాం: స్థానిక 17వ వార్డులోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పల నాయుడుకు వార్డు ఇన్‌చార్జి పెంకి గౌరీశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. టీచర్స్ కాలనీ, అమ్మవారి కాలనీ, ఆదర్శనగర్ కాలనీల పరిశీలనకు వచ్చిన కమిషనర్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏఈ భాగ్యలక్ష్మి, పట్టణ టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ టంకాల కన్నంనాయుడు, దంగుడు బియ్యం శ్రీనివాసరావు, పెంకి చైతన్యకుమార్, మర్రాపు శ్రీనివాసరావు, గ్రంధి గోపి, మరిపి జగన్మోహన్‌రావు, మెంటాడ పద్మశ్రీ, అల్లు మాధవి, నీలంనాయుడు, అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు,

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

చీపురుపల్లి: పట్టణంలోని రావేరు రోడ్డులోగల గాజులవీధిలో రూ.5లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష మాట్లాడుతూ పట్టణంలో అవసరమైన చోట మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి నీరు విడుదల చేయాలి

గుర్ల: తోటపల్లి కాలువ నీరు విడుదల చేయాలని రైతులు కోరు తున్నారు. మండలంలోని జమ్మాపేట, గిరిడా, పెనుబర్తి, రాగోలు, సదానందపురం, తాటిపూడి ప్రధాన కాలువల నుంచి కూడా ఇంత వరకు సాగునీరు విడుదల చేయలేదని వాపోతున్నారు. తోటపల్లి ప్రధాన కాలువ నుంచి నీరు విడుదల చేస్తే తమ ప్రాంతాలకు సాగునీరు పుష్కలంగా అందుతుందన్నారు. కానీ ఇంతవరకు చుక్క నీరు రాలేదని, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మండలంలో ప్రధాన కాలువలకు సాగునీరు అందేలా చూడాలని వారు కోరుతునానరు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు


అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణ

డెంకాడ: యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని సీఐ రామకృష్ణ సూ చించారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఐ ఎ.సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులు మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల బారినపడి బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు. అలాగే వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

చినుకుపడితే దారి కరువు!

- చెరువును తలపిస్తున్న రహదారి
- మోకాలి లోతు నీటిలో రాకపోకలు
- ఇదీ బొబ్బిలి పరిస్థితి


నీటిలో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణం నుంచి పాత బొబ్బిలికి వెళ్లే మున్సిపల్, ఆర్అండ్‌బీ రహదారి వర్షం కురిస్తే చాలు.. దాదాపు కనుమరుగవుతుంది. చర్చి సెంటరు రోడ్డు నుంచి దావాల వీధి, గంగుల వీధి, టీబీఆర్ థియేటర్ జంక్షన్, పాత బొబ్బిలి మీదుగా మక్కువకు వెళ్లే రోడ్డు ఏమాత్రం వర్షం కురిసినా పెద్ద చెరువులా మారుతోంది. దీంతో వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. మోకాలి లోతు నీటిలో ప్రయాణించక తప్పడం లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు దురాక్రమణలకు పాల్పడడంతో రహదారులపై దాని ప్రభావం పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి దీనిపై గగ్గోలు పెడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి మాట్లాడుతూ పాతబొబ్బిలి రహదారిలో తరచూ వరద నీటి సమస్య తీవ్రంగా ఉంటున్నట్లు గుర్తించామన్నారు. దిగువ ప్రాంతంలో కాలువల వ్యవస్థను సరిచేయాల్సి ఉందని తెలిపారు. అంతవరకు ఈ నీటి సమస్య తీరేదెలాగో అర్థం కావడం లేదన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- కోల్‌కతా ఘటనపై నిరసనలు.. ర్యాలీలు





సంతకవిటి: నల్ల బ్యాడ్జీలతో ర్యాలీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు, బొబ్బిలి: ఎన్టీఆర్ కూడలిలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మహిళలు

సంతకవిటి: కోల్‌కతా ట్రైనీ వైద్యురాలి హత్యాచార ఘటన దారుణమని.. బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని గ్రామ, వార్డు సచివాలయ సంఘం డిమాండ్ చేసింది. ఈ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం ప్లకార్డులు పట్టుకుని.. నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. డెమోక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుగుబెల్లి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఘటనకు పాల్పడినవారు ఎంతటి వారైనా బహిరంగ విచారణ చేపట్టి శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం మృతురాలి ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు సాయిలక్ష్మి, శుభాని, మోహన్, దుర్గాప్రసాద్, వెంకటరమణ, స్వప్న, చంద్రశేఖర్, ఉపేంద్ర, వాసు, సూర్య, శివ, చిన్నికృష్ణ, సంతోషి తదితరులు పాల్గొన్నారు. ● **బొబ్బిలి:** కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను కర్కశంగా హతమార్చిన ఘటనను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది గురువారం సాయంత్రం స్థానిక ఎన్టీఆర్ కూడలిలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు శంకరరావు, గోపాలం, మహిళా నాయకులు మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

గ్రామ సభలకు విజయవంతం చేయాలి

లక్కవరపుకోట: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం జరగనున్న గ్రామ సభలకు నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల నేతలు, కార్యకర్తలు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి కూలీలు, వార్డు మెంబర్లు, సర్పంచ్‌లు, ఇతర నేతలు, గ్రామ పెద్దలు పాల్గొనాలని తెలిపారు. ● **లక్కవరపుకోట:** మండలంలో 31 పంచాయతీల్లో గ్రామసభల నిర్వహణకు మండల స్థాయి అధికారులను ఎంపీడీవో కే.రూపేష్ నియమించారు. ఇందుకు సంబంధించి ఈవోపీఆర్డీ, ఏపీవో ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ సహాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ● **సంతకవిటి:** మండల పరిధిలో శుక్రవారం గ్రామసభలు తప్పనిసరిగా నిర్వహించాలని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ● **రాజాం:** గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు గుర్తించేందుకు శుక్రవారం నుంచి చేపట్టనున్న గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టేంట్‌లు. ఉపాధి హామీ పథకం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ● **విజయనగరం రూరల్:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద చేపట్టనున్న పనుల ఆమోదానికి గానూ విజయనగరం మండల పరిధిలో శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు జరగనున్నాయి. ఎంపీడీవో గంటా వెంకటరావు, ఈఓపీఆర్డీ తదితరులు పర్యవేక్షించనున్నారు. ● **బొబ్బిలి రూరల్:** మండలంలోని అన్ని శాఖల అధికారుల సమక్షంలో గ్రామసభలను శుక్రవారం నిర్వహిస్తారు. ఈ సభలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై 87 రకాల పనులు ఆమోదం తెలుపుతారని, అంతా తప్పకుండా హాజరుకావాలని అధికారులు కోరారు. ● **బాడంగి:** మండలంలో 25 పంచాయతీల్లో ఉపాధి పనులపై శుక్రవారం నుంచి సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఆంజనేయులు తెలిపారు. గ్రామాల్లో ప్రాధాన్య క్రమంలో పనులు గుర్తించాలని సిబ్బందికి ఆదేశించినట్టు ఆయన చెప్పారు. సభలకు ప్రజలు హాజరై గ్రామాల్లో ఉన్న పనులను గుర్తించేందుకు సహకరించాలన్నారు. ● **వంగర:** అన్ని గ్రామాల్లో శుక్రవారం ఒకే రోజు గ్రామసభల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేశామని ఏపీఓ సత్యవతి తెలిపారు. అధికారులు బృందాలుగా ఏర్పడి వీటి నిర్వహణకు సిద్ధమవుతున్నారని వివరించారు. ● **రేగిడి:** మండలంలో 39 పంచాయతీల్లో ఉపాధిపనుల గుర్తింపు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వీటిని విజయవంతం చేయాలని ఎంపీడీవో శ్యామలాకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ● **గుర్ల:** గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళికలు తయారుచేసుకోవాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిల్లా అప్పలనాయుడు కోరారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 23న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి గ్రామసభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర సమస్యలు ఏవైనా ఉంటే గ్రామసభలో తీర్మానం చేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి: బొండపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్‌శాఖ ఏఈ జి.శంకరరావు తెలిపారు. మండలంలోని బొండపల్లి, బోడసింగిపేట, దేవుపల్లి, గొల్లుపాలెం, బి.రాజేరు, గొల్లలపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్టు చెప్పారు. అలాగే 11కేవీ పరిధిలోగల గరుడబిల్లి ఫీడర్‌లో చెట్లుకొమ్మలు తొలగిస్తున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ఈ కారణంగా కిండాం అగ్రహారం, కొండకిండాం, ఓంపల్లి, వేండ్రాం, గరుడబిల్లి గ్రామ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ● **భోగాపురం:** మండలంలోని తీర ప్రాంతం ముక్కాం విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్తు శాఖ ఏఈ మస్తాన్‌వలి తెలిపారు. విద్యుత్తు నిర్వాహణ పనుల కారణంగా ముక్కాం, కొండ్రాజుపాలెం, చోడిపల్లిపేట, రామచంద్రపేట, సబ్బన్నపేట, నందిగాం, తోటపల్లి, బోయిపాలెం, ఎర్రముసలయ్యపాలెం, చేపలకంచేరు, దిబ్బలపాలెం గ్రామాల్లో విద్యుత్తు నిలుపుదల చేస్తామని చెప్పారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


గజపతినగరం: వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

బొండపల్లి: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నింబంధనలు పాటించాలని ఎస్ఐ యు.మహేష్ కోరారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్ సమీపంలోగల 26వ జాతీయ రహదారి వద్ద వాహనాల తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని, వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటోల్లో పరిమితికి మంచి ప్రయాణీకులను ఎక్కించరాదని సూచించారు. అయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు. ● **గజపతినగరం:** ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేని ఎడల అపరాధ రుసుం విధించాలని ఎస్ఐ కె.లక్ష్మణరావు అన్నారు. గురువారం మండలంలోని మధుపాడ జంక్షన్‌వద్ద జాతీయ రహదారిపై వాహనాల తనిఖీల్లో భాగంగా ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు చేపట్టడంతో పాటు హెల్మెట్ లేనివారికి అపరాధ రుసుం విధిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు


గ్రావెల్ తరలిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: మెట్టవలస గ్రామ రెవెన్యూ పరిధిలో యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు పట్టపగలే గ్రావెల్ తవ్వి తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. ఈ గ్రావెల్‌ను స్థానిక సూర్య రెసిడెన్సీ పక్కన నూతనంగా నిర్మిస్తున్న భవనం వద్ద డంప్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆర్డీవో కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఇదంతా జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. తక్షణమే అధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ తవ్వకాలను నిరోధించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

- గరివిడి ఐసీడీఎస్ పీవో ఆరుద్ర

గుర్ల: గర్భిణులు, బాలింతల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గరివిడి ఐసీడీఎస్ పీవో ఆరుద్ర సూచించారు. మండలంలోని గరికివలస, కోటగండ్రేడు తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆమె బాలింతలు, గర్భిణులతో మాట్లాడారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలను నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాధిక, శంకుంతల, అంగన్‌వాడీ కార్యకర్తలు హైమావతి, భాగ్యలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా..

నగర పంచాయతీ కమిషనర్ బదిలీ

నెల్లిమర్ల: నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ గురువారం బదిలీ అయ్యారు. ఈయనను శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నగర పంచాయతీకి బదిలీ చేశారు. ప్రస్తుతం నెల్లిమర్ల ఇన్‌చార్జి కమిషనర్‌గా నగర పంచాయతీ మేనేజరు విశ్వేశ్వరరావు కొనసాగనున్నారు.

వేతనాలు చెల్లించాలి

నెల్లిమర్ల: నెల్లిమర్లలోని సామాజిక ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న తమకు తక్షణమే వేతనాలు చెల్లించాలని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగు ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక సీహెచ్‌సీ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఐదు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, దీనివల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈఎస్ఐ కార్డులు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

చీపురుపల్లి: కర్లాం గ్రామంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రితో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పెదమానాపురం ఎస్ఐగా జయంతి

దత్తిరాజేరు: పెదమానాపురం పోలీసుస్టేషన్ ఎస్ఐగా ఆర్.జయంతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈమె బాడంగి ఎస్ఐగా పనిచేస్తూ బదీలపై ఇక్కడకు వచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన కర్రోతు బ్రదర్స్


చంద్రబాబుతో మాట్లాడుతున్న బంగార్రాజు, సత్యనారాయణ

భోగాపురం: ముఖ్యమంత్రి చంద్రబాబును టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ బుధవారం రాత్రి అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా నియోజకవర్గ, మండల ప్రస్తుత పరిస్థితులను, సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వారితో పాటు పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కర్రోతు రాజు, పృథ్వీ ఉన్నారు.